





ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పోర్ట్స్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 351 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
సోమవారం 21 జూలై 2025

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


## పార్లమెంటులో ప్రతిపక్ష నేతగా మాట్లాడే అవకాశం ఇవ్వట్లేదు:రాహుల్ గాంధీ

జూలై 21, (రిపబ్లిక్ న్యూస్): లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తున్న తనకు లోక్ సభ సమావేశాల్లో మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాల్లో అధికార పక్షం సభ్యులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేంద్ర రక్షణ మంత్రి, ప్రభుత్వంలోని ఇతర మంత్రులకు మాట్లాడడానికి అవకాశం ఇచ్చి.. తనకు మాత్రం అభిప్రాయాలను తెలియజేసే అవకాశం ఇవ్వడం లేదని మండిపడ్డారు.



ప్రతిపక్ష నేతగా లోక్సభలో మాట్లాడే హక్కు తనకు ఉన్నప్పటికీ.. వారు ఈవిధంగా చేయడం ప్రతిపక్షాల హక్కులను కాలరాయడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. లోక్సభలో చర్చలు మొదలవగానే ప్రధాని మోదీ అక్కడినుంచి వెళ్లిపోయారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విషయాల్లో తమకు అనుకూలంగా ఉండే కొత్త విధానాలను సృష్టించుకుంటోందని దుయ్యబట్టారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. లోక్ సభ, రాజ్యసభ సమావేశమయిన అనంతరం ఆపరేషన్ సిందూర్ తో పాటు పలు అంశాలపై చర్చకు పట్టుబడుతూ లోక్‌సభలో విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ప్రతిపక్ష ఎంపీలు నిరసనను విరమించాలని సభాపతి పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ వారు వినిపించుకోకపోవడంతో సభను కొంతసేపు వాయిదా వేశారు. రాజ్యసభలో చర్చలు కొనసాగుతున్నాయి.

## గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి దేశంలోనే అతిపెద్ద ఎకో సిస్టం:చంద్రబాబు

అమరావతి, జూలై 21, (రిపబ్లిక్ న్యూస్): గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ- అమరావతి డిక్లరేషన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో చీఫ్ సెక్రటరీ విజయానంద్, నెడ్ క్యాప్ ఎండీ కమలాకర్ బాబు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. 2030 నాటికి ఏపీని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మార్చేందుకు అవసరమైన కార్యాచరణ ప్రకటిస్తూ డిక్లరేషన్ను రూపొందించారు.



ఇటీవల అమరావతిలో గ్రీన్ హైడ్రోజన్పై రెండు రోజుల పాటు జరిగిన సమ్మిట్లో గ్రీన్ హైడ్రోజన్ కంపెనీల సీఈఓలు, సీఓఓలు, ఎండీలు, ఇండస్ట్రీ రంగ నిపుణులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన సమ్మిట్లో చర్చించిన అంశాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం డిక్లరేషన్ ప్రకటించింది. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి అనుకూల పరిస్థితులు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి దేశంలోనే అతి పెద్ద ఎకో సిస్టంను రాష్ట్రంలో నెలకొల్పటమే ఈ డిక్లరేషన్ ఉద్దేశమన్నారు.

## మేడిన్ ఇండియా ఆయుధాల వైపు.. ప్రపంచం చూపు:'ఆపరేషన్ సిందూర్'పై మోదీ

దిల్లీ, జూలై 21, (రిపబ్లిక్ న్యూస్): పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మరికాసేపట్లో ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలకు హాజరయ్యేందుకు పార్లమెంట్కు చేరుకున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ మీడియాతో మాట్లాడారు. ఈ వర్షాకాల సమావేశాలు ఫలప్రదం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసి యాత్ర, 'ఆపరేషన్ సిందూర్' గురించి ప్రధాని ప్రస్తావించారు. "ఆపరేషన్ సిందూర్ మన దేశ సైనికుల సత్తా చూశాం. అందులో వందశాతం లక్ష్యాలను సాధించాం.



కచ్చితమైన లక్ష్యంతో కేవలం 22 నిమిషాల్లోనే ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశాం. ఈ ఆపరేషన్ మేడిన్ ఇండియా సైనిక సామర్థ్యం, గొప్పతనం ఏంటో ప్రపంచం చూసింది. ఈ మధ్య కాలంలో నేను ఎవరిని కలిసినా మేడిన్ ఇండియా ఆయుధాల గురించే మాట్లాడుతున్నారు. మన

**శుభాంశు యాత్ర స్ఫూర్తిదాయకం..:** "ఈ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు దేశానికి చాలా గర్వకారణంగా నిలవబోతున్నాయి. అంతర్జాతీయ ఆయుధాలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతోంది దేశ ప్రగతి కోసం అందరూ కలిసి నడవాల్సిన సమయమిది. ఉగ్రవాదం, నక్సలిజాన్ని తుదముట్టించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి" అని మోదీ వెల్లడించారు. అంతరిక్ష కేంద్రంలో మన మువ్వన్నెల జెండా ఎగరడం దేశ ప్రజలందరికీ గర్వకారణం. అంతరిక్ష యాత్రలో ఇదో ప్రేరణ. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తుంది" అని మోదీ ప్రశంసించారు. దేశవ్యాప్తంగా వర్షాలు బాగా కురుస్తున్నాయని, ఇది రైతులకు లాభదాయకమని ప్రధాని ఆనందం వ్యక్తం చేశారు. రైతుల జీవితాలు, ఆర్థిక వ్యవస్థ వర్షాలపై ఆధారపడ్డాయని తెలిపారు.

ఆపరేషన్ సిందూర్పై మన ఎంపీలు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో పర్యటించి వివరించారని ప్రధాని గుర్తు చేశారు. పాక్ దుష్ట చర్యలను అంతర్జాతీయ సమాజం ముందు ఎండగట్టారని అన్నారు. తుపాకులు, బాంబుల ముందు మన రాజ్యాంగం బలంగా నిలబడిందని తెలిపారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్ విజయాన్ని వేడుక చేసుకోవాలన్నారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో ఐక్యత చాలా అవసరమని.. ఎంపీలు, రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు.

## ఆధారాలు ఉంటేనే ఎవరినైనా అరెస్టు చేస్తారు.. ఏమైనా ఉంటే కోర్టులో తేల్చుకోవాలి:హోంమంత్రి

మడకశిర, జూలై 21, (రిపబ్లిక్ న్యూస్): ఆధారాలు ఉంటేనే ఎవరినైనా అరెస్టు చేస్తారని హోంమంత్రి అనిత అన్నారు. వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు, రిమాండ్ గురించి ఆమె వ్యాఖ్యలు చేశారు. ఏమైనా ఉంటే కోర్టులో తేల్చుకోవాలని చెప్పారు. కోర్టు రిమాండ్ విధించిందంటే మనం గౌరవించాలని పేర్కొన్నారు.



న్యాయస్థానానికి సరైన ఆధారాలు ఇవ్వకుంటే రిమాండ్కు ఇవ్వరు కదా అన్నారు. ప్రొసీజర్ యథావిధిగా సాగుతుందని పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం మూడు సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్లు పనిచేస్తున్నాయని చెప్పారు. జిల్లాకు ఒక సైబర్ క్రైమ్ పీఎస్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారని తెలిపారు. లక్ష సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రతి నియోజకవర్గం, గ్రామంలో వీటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రతి పోలీసుస్టేషన్కు రెండు డ్రోన్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## రెండో దశ భూసమీకరణపై మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించి నిర్ణయం:మంత్రి నారాయణ


అమరావతి, జూలై 21, (రిపబ్లిక్ న్యూస్): రాజధాని రెండో దశ భూ సమీకరణపై మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించాలని గత కేబినెట్ మీటింగ్లో సీఎం అడిగారని తెలిపారు.



ఒకట్రెండు రోజుల్లో భేటీ అయి రెండో దశ భూసమీకరణపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రెండో దశ భూసమీకరణపై నిర్ణయం తీసుకుని వచ్చే కేబినెట్ సమావేశంలో పెడతామని వివరించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు 12 టవర్లలో 288 క్వార్టర్లు డిసెంబర్ నాటికి పూర్తవుతాయని తెలిపారు. మంత్రులు, జడ్జీల క్వార్టర్లు వచ్చే మార్చి నాటికి అందుబాటులోకి వస్తాయన్నారు. అమరావతిలో నిర్మాణంలో ఉన్న భవనాలను మంత్రి పరిశీలించారు.

## రుణమాఫీ చేసింది 30 పైసలు.. ఎగ్గొట్టింది 70 పైసలు:హరీశ్ రావు

ప్రజ్ఞాపూర్, జూలై 21, (రిపబ్లిక్ న్యూస్): భారత రాష్ట్ర సమితి హయాంలో వేసవిలోనూ పంటల సాగుకు తగినంత నీరు ఇచ్చామని మాజీ మంత్రి, ఆ పార్టీ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. గతంలో హల్దీ వాగులో లిఫ్ట్ పెట్టి గద్దర్ వాళ్ల ఊరికి నీళ్లు వచ్చేలా చేశామని చెప్పారు.



కేసీఆర్ పాలనను గద్దర్ కూడా మెచ్చుకున్నారని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల ముఖ్య సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి మద్దతుదారులను గెలిపించుకోవాలన్నారు. అన్ని మండలాల్లో విజయకేతనం ఎగురవేయాలన్నారు. కాంగ్రెస్ పాలనలో భూముల ధరలు తగ్గిపోయాయని చెప్పారు. యాసంగికి సంబంధించి సన్న వడ్లకు బోనస్ రాలేదని విమర్శించారు. రుణమాఫీ చేసింది 30 పైసలు, ఎగ్గొట్టింది 70 పైసలు అని ఎద్దేవా చేశారు. తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడుతున్నారని హరీశ్ రావు దుయ్యబట్టారు.

## విమాన ప్రమాదంపై విదేశీ మీడియా అసత్య ప్రచారం:పార్లమెంట్లో రామ్మోహన్ నాయుడు

దిల్లీ, జూలై 21, (రిపబ్లిక్ న్యూస్): పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు కొనసాగుతున్నాయి. ఇందులోభాగంగా ఇటీవల అహ్మదాబాద్ లో చోటుచేసుకున్న ఘోర విమాన ప్రమాదం పై రాజ్యసభలో చర్చ జరిగింది. దీనిపై విపక్షాలు అడిగిన ప్రశ్నలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సమాధానమిచ్చారు. ఈ ప్రమాదంపై విదేశీ మీడియా అసత్య ప్రచారం చేస్తోందని తెలిపారు."అహ్మదాబాద్ లో చోటుచేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనపై ప్రాథమిక నివేదిక వచ్చింది. దాన్ని పరిశీలిస్తున్నాం. తుది నివేదిక వచ్చాకే దీనిపై మరిన్ని వివరాలు తెలుస్తాయి. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఈ ప్రమాదంపై ఏఏఐబీ (ఎయిర్క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో) పారదర్శకంగా దర్యాప్తు జరుపుతోంది. కానీ, ఈ ఘటనపై విదేశీ మీడియా అసత్య ప్రచారం చేస్తోంది. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు సొంత అభిప్రాయాలు చెప్పకూడదు. విమాన ప్రమాదాలకు సంబంధించిన కేసుల్లో నిబంధనల ప్రకారమే దర్యాప్తు చేపడతారు. అంతర్జాతీయ ప్రోటోకాల్కు అనుగుణంగానే దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది" అని కేంద్రమంత్రి వివరించారు. "ఈ ప్రమాదంలో మేం నిజం వైపు నిలబడాలని కోరుకుంటున్నాం. ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానంలోని బ్లాక్ బాక్స్ ల నుంచి డేటాను విజయవంతంగా సేకరించాం. దానిపై పారదర్శకంగా దర్యాప్తు జరుగుతోంది. ప్రమాద సమయంలో విమానంలో ఏం జరిగిందన్నది తుది నివేదిక వచ్చిన తర్వాత మాత్రమే తెలుస్తుంది. అప్పటివరకు దర్యాప్తు ప్రక్రియను ప్రతిఒక్కరూ గౌరవించాలని కోరుతున్నా" అని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. అంతకుముందు పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ పై చర్చించాలని పట్టుబట్టిన విపక్షాలు.. రాజ్యసభ నుంచి వాకౌట్ చేశాయి.



### లోక్సభలో వాయిదాల పర్వం..

మరోవైపు, లోక్సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. ఆపరేషన్ సిందూర్, పహల్గాం దాడిపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. దీంతో సభపలుమార్లు వాయిదా పడింది.

## భారతీయ చెస్‌కు గర్వకారణం.. కోనేరు హంపిపై చంద్రబాబు ప్రశంసలు





అమరావతి, జూలై 21, (రిపబ్లిక్ న్యూస్): అంతర్జాతీయ వేదికపై కోనేరు హంపి మరింత ప్రకాశించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ లు ఆకాంక్షించారు. ఫిడే వరల్డ్ కప్ సెమీ ఫైనల్స్‌కు చేరిన తొలి భారత మహిళగా ఆమె అరుదైన రికార్డు సాధించారని అభినందించారు.

హంపి సాధించిన విజయం పట్ల గర్వంగా ఉందన్నారు. ఇది కేవలం వ్యక్తిగత విజయం మాత్రమే కాదు.. భారతీయ చెస్కు గర్వకారణమైన క్షణం అని వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని వ్యాఖ్యానించారు. టైటిల్ను ఇంటికి తీసుకురావాలని కోరారు. అగ్రశ్రేణి చెస్ క్రీడాకారిణి, గ్రాండ్మాస్టర్ కోనేరు హంపి సూపర్ ఫామ్ను కొనసాగిస్తోంది. గత ఏడాది ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్గా నిలిచిన ఆమె.. ఇప్పుడు ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ సెమీ ఫైనల్ చేరిన తొలి భారత క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# సినిమా తీయాలంటే ఎన్నో యుద్ధాలు చేయాలి:పవన్ కళ్యాణ్



## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1831:** బెల్జియం జాతీయదినోత్సవం
- **1960:** ప్రపంచ దేశాలలో మొదటి మహిళా ప్రధానిగా గుర్తించబడిన సిరిమావో బండారు నాయకే శ్రీలంక ప్రధానిగా ప్రమాణస్వీకారం. (చిత్రంలో)
- **1961:** పంజాబీ గాయకుడు, గేయ రచయిత, సంగీత వాద్యకారుడు, సంగీత దర్శకుడు అమర్ సింగ్ చంకీలా జననం. (మ. 1988)
- **1969:** పాత్రికేయుడు, కవి పసునూరు శ్రీధర్ బాబు జననం.
- **1972:** భూటాన్ రాజు జిగ్మె దొరి వాంగ్ ఛుక్ మరణం (జ. 1929).
- **2009:** హిందుస్తాని గాయని, పద్మభూషణ్, పద్మవిభూషణ్ గ్రహీత గంగూబాయ్ హంగళ్ మరణం (జ. 1913).
- **2013:** తెలుగు రచయిత, కళాకారుడు గిడుగు రాజేశ్వరరావు మరణం. (జ. 1932)



బెల్జియం


సిరిమావో బండారు నాయకే


అమర్ సింగ్ చంకీలా


జిగ్మెదొరి వాంగ్ ఛుక్


గంగూబాయ్ హంగళ్


గిడుగు రాజేశ్వరరావు



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ 'హరి హర వీరమల్లు'. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకులు. నిధి అగర్వాల్ కథానాయిక. ఏఎం రత్నం నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ మూవీ జులై 24న పాన్‌ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈసందర్భంగా టీమ్ స్పెషల్ ప్రెస్మీట్ నిర్వహించింది. ఇందులో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. పోడియం లేకుండా మాట్లాడటం కష్టంగా ఉందని నవ్వుతూ పవన్ తన స్పీచ్ను ప్రారంభించారు. "నా జీవితంలో సినిమాపరంగా మీడియాతో మాట్లాడడం ఇదే తొలిసారి. సినిమాను ఎలా ప్రమోట్ చేసుకోవాలో నాకు తెలియదు. దీనికోసం ఇంత కష్టపడ్డాం అని చెప్పడం నాకు మొహమాటంగా ఉంటుంది. నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో నా ఫొటోలు కూడా పేపర్లో వేయలేదు. దీంతో పబ్లిసిటీ లేకుండానే నా సినిమాలు రిలీజ్ అయ్యాయి. సినిమా గురించి నాకు ఏం మాట్లాడాలో తెలియదు. ఈ ప్రెస్మీట్ పెట్టడానికి కారణం ఏఎం రత్నమే. సినిమాను తెరకెక్కించాలంటే ఎన్నో యుద్ధాలు చేయాలి. మన చిత్ర పరిశ్రమని పాన్‌ఇండియా స్థాయికి తీసుకువెళ్లిన వ్యక్తి రత్నం. ఈ సినిమా చాలా ఒడుదొడుకులు ఎదుర్కొంది. నేను పాలిటిక్స్కు వెళ్లిపోయిన తర్వాత సినిమాకు టైం ఇవ్వలేకపోయాను. అయినప్పటికీ నా బెస్ట్ ఇచ్చాను. గతంలో నేను నేర్చుకున్న మార్షల్‌ఆర్ట్స్ ఈ సినిమాకు ఎంతో పనికి వచ్చింది" అని పవన్ వివరించారు.

### అందుకే ప్రత్యర్థులు తిడుతున్నా వచ్చా..

"ఈ సినిమాకు క్లైమాక్స్ ఆయువుపట్టు. కోహినూర్ వజ్రం చుట్టూ కథ తిరుగుతుంది. క్రిష్ చాలా మంచి కాన్సెప్ట్ ముందుకువచ్చారు. ఆయనకు మా టీమ్ అందరి తరపున కృతజ్ఞతలు. ఒక్కోసారి ఇండస్ట్రీ చాలా కఠినంగా ఉంటుంది. రత్నం ఎంతో ముందుచూపు ఉన్న నిర్మాత. ఆయన ఈ సినిమా కోసం ఎంతో నలిగిపోయారు. ఈ సినిమా పూర్తవుతుందా, లేదా? అని అనుకున్నప్పుడు దీనికి కీరవాణి ప్రాణం పోశారు. ఒక్కోసారి డబ్బులు, సక్సెస్ కోసం కాదు ఇండస్ట్రీ బాగుకోరే వ్యక్తుల వెంట నిలవడం ఎంతో ముఖ్యం. అందుకే ప్రత్యర్థులు తిడుతున్నా ఈ మీటింగ్కు వచ్చాను. ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్కు చైర్మన్ రత్నం పేరును ప్రతిపాదించాను. నాకు సినిమా అన్నం పెట్టింది. సినిమా అంటే నాకు ప్రాణవాయువుతో సమానం" అని పవన్ తెలిపారు.

### రేపు నా కుమారుడైనా అంతే..

"మిగతా హీరోలకు బిజినెస్ అయినంతగా నా సినిమాలకు అవ్వదు. నేను ప్రజల కోసం దృష్టిపెట్టాను. బాబీదేవోల్ అద్భుతంగా చేశారు. ఈ సినిమా ప్రమోషన్ ను నిధి తన భుజాలపై వేసుకుంది. ఈ సినిమా అనాథ కాదు.. నేనున్నా అని చెప్పడానికే వచ్చాను. కోట్లాది మంది ప్రజలకు అండగా ఉండేవాడిని. దేశ సమస్యల కోసం పోరాటాలు చేసేవాడిని. నా సినిమాకు అండగా ఉండలేనా అనిపించింది. నా సినిమాల సమయంలో గతంలో ఎన్నో ఇబ్బందులు పెట్టారని మీకూ తెలుసు. మన ప్రభుత్వం చిత్రపరిశ్రమను ఎంతో ఆదరిస్తోంది. అందుకే ఈ సినిమా ప్రచారంలో భాగం కావాలని వచ్చాను. భారతీయ సినిమాకు కుల, మత భేదాలు ఉండవు. క్రియేటివిటీ మీదనే ఆధారపడి ఉంటుంది. చిరంజీవి కుమారుడైనా, తమ్ముడైనా ఎవరైనా టాలెంట్ లేకపోతే నిలబడలేరు. రేపు నా కుమారుడైనా అంతే. ఇక్కడ ప్రతిభే ముఖ్యం" అని పవన్ పేర్కొన్నారు. "ఈ సినిమా కోసం తెల్లవారుజామున 2 గంటలకు లేచి కష్టపడేవాడిని. జ్యోతికృష్ణ ఎంతో సత్తా ఉన్న దర్శకుడు. ఈ సినిమా ఫలితం పూర్తిగా ప్రజల చేతిలో ఉంటుంది. మిగతా వారితో పోలిస్తే నేను కొన్ని పనులు చేయలేను. సుస్వాగతం సినిమాలో బస్సు మీద ఎక్కి డ్యాన్స్ చేయమన్నారు. నేను చేయలేక చచ్చిపోయా. సినిమాలు చేయలేను మానేస్తాను అని మా వదిన (చిరంజీవి సతీమణి సురేఖ)కు కూడా చాలాసార్లు చెప్పాను. యాక్షన్ సీక్వెన్స్ కూడా మార్షల్ ఆర్ట్స్ చేసా కాబట్టి అవగాహన ఉంది. టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ అని వేరు చేయడం నాకు నచ్చదు" అని పవన్ అన్నారు. ఈ సినిమాలో 20 నిమిషాల ఫైట్ సన్నివేశానికి పవన్కల్యాణ్ కొరియోగ్రఫీ చేశారని దర్శకుడు జ్యోతికృష్ణ చెప్పారు. పవన్ తో నటించే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు నటి నిధి అగర్వాల్ అన్నారు.

## నా భార్య పాదాలను తాకిన తర్వాతే నిద్రపోతా: ఎమోషనల్ అయిన నటుడు





జీవితంలో అత్యంత క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు తన భార్య ఎంతగానో అండగా నిలిచిందని వెల్లడించారు ప్రముఖ నటుడు, ఎంపీ రవి కిషన్. అందుకే ప్రతి రోజూ ఆమె పాదాలను తాకి కృతజ్ఞతలు చెప్పనిదే తాను నిద్రపోనని తెలిపారు. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. తన అర్ధాంగి గురించి చెబుతూ ఎమోషనల్ అయ్యారు. 'సన్ ఆఫ్ సర్దార్ 2' ప్రమోషన్స్లో భాగంగా అజయ్ దేవగణ్, మృణాల్ ఠాకూర్, రవి కిషన్తో పాటు ఇతర చిత్రబృందం.. 'ది గ్రేట్ ఇండియన్ కపిల్ షో'లో పాల్గొంది. ఈ షో సమయంలో రవి కిషన్ గురించి హోస్ట్ కపిల్ శర్మ ఓ ఆసక్తికర విషయాన్ని బయటపెట్టారు. రవి ప్రతి రాత్రి నిద్రపోయే ముందు భార్య ప్రీతి కిషన్ పాదాలను తాకుతారని తెలిపారు. దీన్ని ఆ నటుడు నవ్వుతూ అంగీకరించారు."అవును నేను రోజూ అలాగే చేస్తా. కానీ అందుకు నా భార్య అంగీకరించదు. అందుకే ఆమె నిద్రపోయిన తర్వాత ఆమె పాదాలను తాకుతా. నా దగ్గర పేరు, పలుకుబడి, డబ్బు లేని సమయంలో కూడా ఆమె నా పక్కన నిలబడింది. ఎన్నో ఒడుదొడుకులను తట్టుకుంది. ఇప్పుడు నేను ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు ఆమే కారణం. అంత చేసిన ఆమెకు నేను ఏం ఇవ్వగలను. అందుకే కనీసం పాదాలను తాకి అయినా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా" అని రవి కిషన్ ఉద్వేగానికి లోనయ్యారు. నటుడి మాటలు వినగానే తోటి చిత్ర బృందం చప్పట్లతో ఆయనను అభినందించింది. 1993లో రవి కిషన్ తన చిన్ననాటి స్నేహితురాలైన ప్రీతిని వివాహం చేసుకున్నారు. వీరికి నలుగురు సంతానం. ఈ నటుడు తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. రేసు గుర్రం సినిమాలో విలన్గా అలరించిన ఆయన.. ఇటీవల బాలకృష్ణ నటించిన డాకు మహరాజ్ సినిమాలో కీలక పాత్ర పోషించారు. నటనతో పాటు రాజకీయాల్లోనూ రాణిస్తున్నారు. గతేడాది జరిగిన లోక్సభ ఎన్నికల్లో గోరఖ్ పూర్ నుంచి ఎంపీగా గెలుపొందారు.

ప్రజా రిపబ్లిక్ దిన పత్రిక
9948814188, 9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాప్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/161/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్



## 2-టైర్ టెస్టు ఫార్మాట్ అమలుపై ఐసీసీ కమిటీ..
# మళ్లీ ఛాంపియన్స్ లీగ్




టెస్టు క్రికెట్ విషయంలో ఐసీసీ కీలక అడుగు ముందుకేసింది. అదేవిధంగా దాదాపు 12 ఏళ్ల నుంచి నిర్వహించని ఛాంపియన్స్ లీగ్ను పునఃప్రారంభించేందుకూ ఐసీసీ నిర్ణయం తీసుకుంది. సింగపూర్ వేదికగా ఐసీసీ ఛైర్మన్ జైషా అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బీసీసీఐ, ఈసీబీ, క్రికెట్ ఆస్ట్రేలియా ప్రతినిధులు పాల్గొన్నారు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నుంచి ఎవరూ హాజరు కాలేదు.

### సీఈవో నేతృత్వంలో..

ఇటీవలే ఐసీసీ నూతన సీఈవోగా నియమితులైన సంజోగ్ గుప్తా నేతృత్వంలోనే ఎనిమిది మందితో కూడిన కమిటీ పనిచేయనుంది. 2 టైర్ టెస్టు క్రికెట్ను ఎలా అమలుచేయాలి? దానివల్ల ఎదురయ్యే లాభనష్టాలపై ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ లో 9 జట్లు తలపడుతున్నాయి. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్లో తలపడతాయి. అక్కడ విజేతగా నిలిచిన టీమ్కు ప్రైజ్మనీతోపాటు 'గద'ను ఐసీసీ బహూకరిస్తుంది. ఇప్పుడు 2 టైర్ సిస్టమ్ను అమల్లోకి తెస్తే మాత్రం ఆరేసి జట్లు రెండు డివిజన్లుగా విడిపోతాయి. అక్కడి ఫలితాలను బట్టి పై గ్రూప్ కి ప్రమోషన్ లేదా రెండో గ్రూప్లోకి పడిపోవడం జరుగుతుంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, భారత్ ప్రతి నాలుగేళ్లకు రెండు సిరీసుల్లో తలపడుతున్నాయి. ఇప్పుడు కొత్త ఫార్మాట్ వస్తే ఆ సమయం మూడేళ్లకు తగ్గనుంది. అయితే, టెస్టు క్రికెట్లో ఎలాంటి కొత్త నిర్ణయాలైనా 2027-29 సీజన్ నుంచే అమల్లోకి వస్తాయి.

### లీగ్ ల్లో ఛాంపియన్ కోసం..

చివరిసారిగా పదకొండు సంవత్సరాల కిందట ఛాంపియన్స్ లీగ్ టీ20 టోర్నీ జరిగింది. ఆ తర్వాత ఇప్పటివరకు ఒక్కసారి కూడా దీన్ని నిర్వహించకపోవడం గమనార్హం. బోర్డులు నిర్వహించే లీగ్ టాప్ -2 జట్లు ఛాంపియన్ లీగ్లో తలపడతాయి. 2014లో జరిగిన సీఎల్20 విజేతగా చెన్నై సూపర్ కింగ్స్ నిలిచింది. ఫైనల్లో కోల్కతా నైటైడర్స్పై విజయం సాధించింది. ఇప్పుడు భారత్తోపాటు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్లోలో మెగా లీగ్ లు ఉన్న సంగతి తెలిసిందే. దాదాపు పుష్కరకాలం తర్వాత ఛాంపియన్స్ లీగ్ను 2026 నిర్వహించాలని ఐసీసీ నిర్ణయం తీసుకుంది. అయితే, వేదిక ఎక్కడనేది ఇంకా డిసైడ్ చేయలేదని క్రికెట్ వర్గాలు తెలిపాయి.


## అందం

## పటికని వాడి చర్మం, జుట్టు సమస్యల్ని దూరం చేయొచ్చు, తెల్లజుట్టు నల్లగా మారేందుకు ఎలా వాడాలంటే


ఫిట్కారీ..
దీనినే ఆలమ్, పటిక అంటారు. ఇది పొటాషియం, అల్యూమినియంల డబుల్ లవణం. దీనిని మనం అనేక రకాలుగా వాడుకోవచ్చు. దీంతో అందానికి కలిగే లాభాలేంటో తెలుసుకోండి.

ప్రతి ఒక్కరూ కూడా అందంగా ఉండాలనుకుంటారు. దానికోసం రకరకాల ప్రయత్నాలు చేస్తారు. అయితే, ఎన్నో కారణాల వల్ల స్కిన్ అండ్ హెయిర్ ప్రాబ్లమ్స్ వస్తాయి. పొల్యూషన్, డైట్ సరిగా లేకపోవడం, మంచి లైఫ్‌స్టైల్ లేకపోవడం వంటి ఇతర కారణాల వల్ల సమస్యలొస్తున్నాయి. వీటిని దూరం చేయడానికి కొన్ని ఇంటి చిట్కాలు ఉన్నాయి. అందులో పటిక కూడా ఒకటి. దీనిని వాడడం వల్ల స్కిన్, హెయిర్ ప్రాబ్లమ్స్ ఎలా దూరం చేసుకోవాలో తెలుసుకోండి.

### ముడతలు తగ్గించి



పటిక ఓ సహజ ఆస్ట్రింజెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. దీని వల్ల స్కిన్‌కి చాలా మంచిది. ఇది చర్మంపై ఉన్న ముడతల్ని తగ్గించి స్కిన్‌ని టైట్‌గా చేస్తుంది. దీంతో ముఖంపై ఉన్న పోర్స్ కూడా తగ్గుతాయి. పటిక వాడడం వల్ల వడదెబ్బ నుండి కమిలిన ముఖంపై మచ్చలు తగ్గుతాయి. పటికపొడితో తయారుచేసిన పేస్టుని రాయడం వల్ల ఎర్ర, నల్ల మచ్చలు తగ్గుతాయి.




### మొటిమలు తగ్గేందుకు



ఫిట్కారీలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి. దీని వల్ల చర్మానికి చాలా మంచిది. ఇది మొటిమలు, మచ్చల్ని తగ్గిస్తుంది. రెగ్యులర్‌గా రాస్తే చాలా మంచి రిజల్ట్స్ ఉంటాయి. దీని వల్ల బ్యాక్టీరియా, వాపు తగ్గి బ్రేక్‌అవుట్స్ తగ్గుతాయి. దీనిని పెరుగు లేదా తేనెతో కలిపి ఫేస్‌మాస్క్‌లా వాడొచ్చు. దీని వల్ల స్కిన్‌కి మంచి ఫేస్‌ప్యాక్‌లా పనిచేస్తుంది.

### బ్రైట్‌గా కనిపించేందుకు



పటికని రాయడం వల్ల చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. ఎందుకంటే ఇది చనిపోయిన చర్మ కణాలను తొలగించడంలో సాయపడుతుంది. దీంతోపాటు నల్లమచ్చల్ని, పిగ్మంటేషన్‌ని తగ్గిస్తుంది. అదే విధంగా నీటిలో పటిక పొడిని కలిపి కాటన్ ప్యాడ్ లేదా స్ప్రే బాటిల్ సాయంతో ముఖానికి రాస్తే చక్కని టోనర్‌గా పనిచేస్తుంది.


### జుట్టుకి



### చుండ్రు తగ్గేందుకు

పటికలో యాంటీ మైక్రోబయల్ గుణాలు ఉన్నాయి. ఇవి చుండ్రుని తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి. చుండ్రుని తగ్గించేందుకు తల ఆరోగ్యం బాగుంటుంది. దీనికోసం నీటిలో పటికని కలిపి జుట్టుని కడిగించాలి. దీని వల్ల తలపై పిహెచ్ బ్యాలెన్స్ అవుతుంది. దురద తగ్గుతుంది.

### అన్‌వాంటెడ్ హెయిర్



పటిక రాయి వాడడం జుట్టు వల్ల అన్‌వాంటెడ్ హెయిర్‌ని రిమూవ్ చేయొచ్చు. నీరు, రోజ్‌వాటర్‌తో పటికపొడి కలిపి పేస్టులా చేయాలి. దీనిని రాసి ఆరిన తర్వాత రుద్దితే అన్‌వాంటెడ్ హెయిర్ రిమూవ్ అవుతుంది.

### హెయిర్ స్ట్రెయిటనింగ్



నీరు లేదా గుడ్డు తెల్లసొనలో ఆలం కలిపి జుట్టుకి హెయిర్ మాస్క్ వేయండి. దీని వల్ల జుట్టు స్ట్రెయిట్‌గా మారుతుంది. దీంతో పాటు, జుట్టు నల్లబడేందుకు పటికని వాడొచ్చు. పటిక రాయిని పౌడర్‌లా చేసి రోజ్‌వాటర్‌తో కలిపి పేస్టులా చేసి రెగ్యులర్‌గా జుట్టుకి రాస్తే జుట్టు నల్లగా మారుతుంది.

గమనిక:నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.